హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 | కనిష్ఠం 23.0

భువనగిరి ప్రతిష్ఠాత్మకం





సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రంలో పట్టు నిలుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుండగా, గత వైభవాన్ని చాటుకునేందుకు బీఆర్ఎస్, తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నాయి. అన్ని పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇప్పటికే సర్వేలు నిర్వహించాయి. అయితే సర్వేల్లో వచ్చిన అనుకూల, ప్రతికూల పరిస్థితులను అనుసరించి అభ్యర్థుల ఎంపిక విషయంలో అచితూచి అడుగులు వేస్తున్నాయి. ప్రధాన పార్టీలు బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు తీవ్ర కసరత్తు చేస్తూ గెలుపు గుర్రాలపై దృష్టి కేంద్రీకరించాయి. - (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

» గెలుపు గుర్రాలపై నజర్ » ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల కోసం కసరత్తు » రెండు రోజుల్లో రానున్న స్పష్టత » ఇప్పటికే బీజేపీ అభ్యర్థులు ఖరారు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సామాజికంగా, ఆర్థికంగా, పార్టీ పరంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులను రంగంలోకి దించేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. మరోవైపు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ విడుదల చేసింది. అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. బీఆర్ఎస్ సైతం పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసినా, అధికారికంగా రెండో రోజుల్లో వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక కాంగ్రెస్ నల్లగొండకు అభ్యర్థిని ప్రకటించినప్పటికీ, భువనగిరి ఎంపీ అభ్యర్థి విషయంలో సీరియస్‌గా కసరత్తు చేస్తోంది. ఒకటి రెండురోజుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం సైతం తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో ఎన్నడూ లేనంత సమాలోచనల్లో నిమగ్నమయ్యాయి. మరోవైపు పలు పార్టీల్లో బలమైన నేతలు పోటీ చేసేందుకు సిద్ధంగా లేకపోవడం అధిష్ఠానాలకు తలనొప్పిగా మారింది. ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ ఉండనుంది. నియోజకవర్గాల్లో త్వరలో ప్రచారం హోరెత్తనుంది.

అభ్యర్థులపై నేడే రేపో కీలక నిర్ణయం

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మొదటి జాబితాలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డికి అవకాశం కల్పించింది. జానారెడ్డి తన రాజకీయ వారసులుగా ఇద్దరు కుమారులు రాజకీయ అరంగ్రేటం చేశారు. ఇప్పటికే నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా ఆయన కుమారుడు జైవీర్‌రెడ్డి గెలిపించుకున్న ఆయన, అధిష్ఠానాన్ని ఒప్పించి నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి తన తనయుడికి టికెట్‌ను ఇప్పించుకోగలిగారు. ఈ మేరకు నల్లగొండలో ఆయన ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సోమవారం ఢిల్లీలో అభ్యర్థుల ఎంపికపై సీఈసీ సమావేశమైంది. ఏ నియోజకవర్గాల్లో ఎవరెవరిని బరిలో దించాలనే అంశంపై చర్చించింది. అయితే భువనగిరి అభ్యర్థి విషయంపై రాష్ట్ర నాయకత్వంతో భేటీ అయి కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. రెండో జాబితాలో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. దీంతో భువనగిరి నియోజకవర్గంలో రోజురోజుకూ రాజకీయ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలోని నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి సోదరుడి తనయుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డితో పాటు పలువురు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తాజాగా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పేర్లు సైతం తెరపైకి వచ్చాయి. గుత్తా సుఖేందర్‌రెడ్డి సైతం తన తనయుడిని రాజకీయ అరంగ్రేటం చేయించాలని చూస్తున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్‌ను భువనగిరి స్థానం నుంచి తన కుమారుడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. అయితే బీఆర్ఎస్ నేతల్లో నెలకొన్న విభేదాలతో కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. పైళ్ల శేఖర్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతల అండదండలతో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. తనకు భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని అధిష్ఠానంతో ఆయన చర్చించినట్టు సమాచారం. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం రాష్ట్ర పార్టీ నాయకత్వం సూచించిన అభ్యర్థినే ఎంపిక చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో భువనగిరి ఎంపీ టికెట్‌పై రాష్ట్ర నాయకత్వం ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై కసరత్తు తుది దశకు వచ్చింది. తమకు అనుకూలంగా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర పార్టీ యత్నిస్తోంది. అభ్యర్థి ఎంపికలో పార్టీలోని అగ్రనేతలు పైచేయి సాధించేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న బీజేపీ




లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణాలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతోంది. భువనగిరి అభ్యర్థిగా, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ అభ్యర్థిగా సైదిరెడ్డిని ప్రకటించింది. ఈ మేరకు నియోజకవర్గాల్లో వారు ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టేందుకు స్వయంగా రాష్ట్ర నాయకత్వం షెడ్యూల్‌ను రూపొందించింది. తెలంగాణాలో పాగా వేసేందుకు అగ్రనేతలు ప్రచార పర్వంలో దిగనున్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాతోపాటు పలువురు కేంద్ర మంత్రులు బహిరంగ సభలు నిర్వహించారు. ఏ నియోజకవర్గాల్లో అగ్రనేతలతో ప్రచారాన్ని చేపట్టలనే అంశంపై పార్టీ సమాలోచనలు చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీ కనీసం 10 లోక్‌సభ స్థానాల్లో గెలుపొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తమకు అనుకూలంగా ఉన్న స్థానాల్లో ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టాలని యోచిస్తోంది.

రంగంలోకి సీపీఎం

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీలో ఉంటామని సీపీఎం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీలో ఉంటారని పార్టీ ప్రకటించింది. వామపక్ష పార్టీల నుంచి సీపీఎం రంగంలో ఉండగా, సీపీఐ సైతం రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానాన్ని కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయంపై సీపీఐ పోటీచేసే స్థానాలు ఆధారపడి ఉన్నాయి. సీపీఎం ఒంటరిగానే పోటీకి సిద్ధమైంది.

అభ్యర్థుల ఎంపికకు బీఆర్ఎస్ కసరత్తు పూర్తి



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్టు సమాచారం. రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించడమే తరువాయి అని పార్టీ సీనియర్‌నేతలు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ సారు.. కారు.. పదహారు నినాదంతో ముందుకు వెళ్లగా, ఈసారి ఆచితూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఉద్యమ పార్టీ అయి ఉండి, చాలాచోట్ల భారీ ఓట్ల మెజార్టీతో అభ్యర్థులు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణాలను విశ్లేషించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అగ్రనేతలు భేటీలు నిర్వహిస్తున్నారు. నల్లగొండ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరి అభ్యర్థిగా బూడిద భిక్షమయ్యగౌడ్‌ను అభ్యర్థులుగా అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. రెండు రోజుల్లో అధికారికంగా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి ఆ పార్టీ నిర్ణయం తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు.

స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వైభవంగా రథోత్సవం

చూడముచ్చటగా యాదాద్రిశుడికి వెండి గరుడసేవ



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం లక్ష్మీనరసింహుల వెండి గరుడవాహన సేవ చూడముచ్చటగా కొనసాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా తిరుకల్యాణ వేడుకలు కొనసాగగా.. మరుసటి రోజున ఉదయం లక్ష్మీనాథుడైన స్వామివారు విష్ణుమూర్తి అలంకారంలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడి వాహనంపై దేవేరి శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సమేతంగా ఆలయ తిరువీధుల్లో ఊరేగారు. అలంకార శోభితుడు లక్ష్మీనృసింహులను వేదస్వరూపుడైన వెండి గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి వేద పండితులు, పారాయణీకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ గరుడవాహన సేవోత్సవం, రాత్రికి రథోత్సవం నిర్వహించారు. - యాదగిరిగుట్ట

●7లో..



నృసింహుడికి వెండి గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సీజ్ చేసిన వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో మాట్లాడుతున్న హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి అర్బన్, మార్చి 19: ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసిన సొమ్మును వివరాలను ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వెబ్ పోర్టల్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు తనిఖీల్లో పట్టుబడిన నగదు, మద్యం, బంగారం, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువుల వివరాలను పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు పి.బెన్ షాలోమ్, కే.గంగాధర్, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, జడ్పీ సీఈవో శోభారాణి, సీపీవో వెంకటేశ్వర్లు, లీడ్ మేనేజర్ రామకృష్ణ, పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, జీఎస్టీ అధికారి అభిలాష్ బిస్త్, ఆదాయ పన్ను శాఖ అధికారి శ్రీనివాసరావు, సేల్‌టాక్స్ అధికారి పద్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లికి సబర్బన్ బస్సులు నడిపేందుకు కృషి చేస్తా

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన భూదాన్‌పోచంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీత సుధాకర్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 19: ప్రపంచ పర్యాటక కేంద్రంగా, సిల్కుసిటీగా పేరొందిన భూదాన్‌పోచంపల్లికి సబర్బన్ బస్సులు నడిపించేందుకు అధికారులతో చర్చించి కృషి చేస్తానని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సీత సుధాకర్‌తోపాటు పలువురు నాయకులు మంత్రి ప్రభాకర్‌ను కలిసి బస్సుల సమస్యను వివరించారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి భూదాన్‌పోచంపల్లి వరకు, పోచంపల్లి నుంచి భువనగిరి వరకు బస్సుల పరిమితి పెంచాలని, నిత్యం హైదరాబాద్‌కు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులకు బస్సులు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు అతి సమీపంలోఉన్న భూదాన్‌పోచంపల్లికి సబర్బన్ బస్సులు నడిపించాలన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రుద్ర చందు, పెంట నవీన్, చేరాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ ప్రశాంతంగా 'పది' పరీక్షలు

భువనగిరి అర్బన్, మార్చి 19: జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు హిందీ పరీక్షలకు 9,117మంది విద్యార్థులకు 9,092 మంది విద్యార్థులు హాజరుకాగా, 25 మంది గైర్హాజయ్యారు. భూదాన్‌పోచంపల్లిలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, జిల్లా పరిశీలకులు రమణకుమార్, డీఈవో కే.నారాయణరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

పరీక్షా కేంద్రంలో కోతుల బెడదను నివారించాలి : కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రంలో కోతుల బెడదను నివారించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. మంగళవారం ఆయన పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ నెల 18వ తేదీన పరీక్ష కేంద్రంలో కోతుల బెడదతో భవనంపై నుంచి దూకిన మనోజ్ఞ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వరకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి కోతుల నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట భూదాన్‌పోచంపల్లి తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

లౌకికత్వం, జాతీయతావాదం ఆర్‌టీఐతోనే సాధ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

- సమాచార హక్కు కమిషన్ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం అభినందనీయం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

ఆలేరు రూరల్, మార్చి 19: లౌకికత్వం, జాతీయవాదం ఆర్‌టీఐతోనే సాధ్యమని, సమాచార హక్కు కమిషన్ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆలేరులోని కేవైఆర్ గార్డెన్‌లో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవా సదనం డైరెక్టర్ మహ్మద్ ఖుర్షిద్ పాషా అధ్యక్షతన జరిగిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్‌టీఐ కార్యకర్తలు, మేధావులు, విద్యావంతులు ప్రజాస్వామ్యం పరిడవిల్లాలంటే గాంధీవాదాన్ని, కాంగ్రెస్‌ను కేంద్రంలో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి గాంధీ కుటుంబం చేయాల్సిన త్యాగం మరువలేనిదని, కాంగ్రెస్ బలహీనమైతే దేశం బలహీనమవుతుందన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆమోదించడం శుభపరిణామమన్నారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా సామాన్య ప్రజలకు సైతం గౌరవం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్‌టీఐ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను అన్ని పార్టీలతోపాటు విద్యార్థులు, విద్యావంతులు, మేధావులు వ్యతిరేకించాలన్నారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా అధికారుల్లో భయం నెలకొందని, అవినీతి అక్రమాలకు పాల్పడాలంటే భయపడిపోతున్నారని చెప్పారు. ఎన్ని చట్టాలు తెచ్చినా, మన దేశం అవినీతి భూతాన్ని నిర్మూలించలేకపోతుందన్నారు. ఎంపీగా, మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన అభివృద్ధి కొనసాగాలంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తానికే ఓటు వేయాలన్నారు. సీనియర్ జర్నలిస్టు, సామాజిక, రాజకీయ విశ్లేషకుడు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకుంటే సమాజం, రాష్ట్రంఅభివృద్ధి చెందుతుందన్నారు. పాలకులు ప్రజలకు ఎలాంటి కష్టాలు, నష్టాలు జరగకుండా ప్రజాపాలన చేయాలన్నారు. కార్యక్రమంలో సమాచార వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకవరం మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, గాదె సోమిరెడ్డి, సురిపంగ శివలింగం, జాన్సన్, దాసి శంకర్, సురేష్, బాలస్వామి, చింతకింది వెంకటేశ్వర్లు, పోతుగంటి సంపత్‌కుమార్, ఏ రాజు, పరుశరాములు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ సదానందం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సదానందం

తుర్కపల్లి, మార్చి, 19: సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ సదానందం అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పశువులకు గాలికుంటు వ్యాధి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు గాలికుంటు వ్యాధి టీకా ప్రాముఖ్యాన్ని రైతులకు వివరించారు. శిబిరంలో 27 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 224 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.జనార్ధన్, వీఏ ఎండీ.శంశోద్దీన్, నోవార్టిస్ ఆగ్రో ఫెడరేషన్ సంస్థ అసిస్టెంట్ మేనేజరు గజేంద్ర, వైద్య సిబ్బంది పి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాచకొండ భూ సమస్యలు పరిష్కరించాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఐలయ్య, రైతులు

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 19: రాచకొండ రైతాంగం ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య డిమాండ్‌చేశారు. సంస్థాన్‌నారాయణపురంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాచకొండలో 70 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న సర్వే నెం.273, సర్వే నెం.192లోని భూములకు గత ఉమ్మడిరాష్ట్రంలో పాస్ బుక్‌లు ఇచ్చారని తెలిపారు. భూప్రక్షాళన పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిలో రైతులకు సంబంధించిన హక్కులను తీసేసిందన్నారు. కబ్జా కాస్తు, 1-బీలో రైతుల పేర్లు ఉన్న నూతన పాస్ పుస్తకాలు జారీ చేయలేదన్నారు. అటవీ, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం తో ఏడేళ్లుగా రైతులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారన్నారు. రాచకొండ భూ సమస్యలపై టీడీపీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా రాచకొండ రైతులకు భూమిపై హక్కులు కల్పించి న్యాయం చేయాలన్నారు. అనంతరం రైతులతో కలిసి తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్పుల సుదర్శన్, రైతులు నరసింహ, నల్లపోతు యాదయ్య, శ్రీను, భాష తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

ఆత్మకూరు (ఎం) మార్చి19: రాష్ట్రంలో ఉన్న మిగులు భూములను గుర్తించి భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కుటుంబాలకు రోజు ఉపాధి కల్పించడంకోసం కమ్యూనిస్టుల పోరాటం ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఉపాధి పనులు జరుగుతన్న ప్రదేశంలో కూలీలకు నీడకోసం టెంట్లు వేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించాలని, ఇంటిస్థలం లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోరం అహర్నిషలు కృషి చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి జెట్ట రాములు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేశ్వర్లు, సీపీఐ మండల నాయకులు ఎం.వెంకటేశం, ఎస్.లింగారెడ్డి, జెక్క దయాకర్‌రెడ్డి, ఎస్.పురుషోత్తం, రాజమణి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

» ఏళ్ల తరబడి టెంట్లు, మెడికల్ కిట్లు రాని వైనం
» పట్టించుకోని అధికారులు

●8లో..

రూ.23.14లక్షల నగదు, మద్యం స్వాధీనం

ఆత్మకూరు(ఎస్)నార్కట్‌పల్లి, దామరచర్ల,కోదాడరూరల్, తిప్పర్తి, మద్దిరాల, మార్చి 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.23.14 లక్షల నగదుతో పాటు అక్రమంగా నిల్వ చేసిన రూ. 42,170 విలువైన మద్యాన్ని, రూ. 1.96 లక్షల విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● నార్కట్‌పల్లి పరిధిలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేకుండా ముగ్గురి వద్ద ఉన్న రూ. 3,04,500ల నగదుతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో నిల్వచేసిన రూ. 32,170 విలువైన మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

●ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన పెనక గోపీనాథ్ తన కారులో హైదరాబాద్ నుంచి నెల్లూరుకు రూ.9.50 లక్షల నగదుతో వెళ్తున్నాడు. దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

● ఏపీ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఐదు కార్లలో తనిఖీచేసి మొత్తం రూ.4,76,900 నగదును గుర్తించినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

●నల్లగొండజిల్లా మిర్యాలగూడలోని సాగర్‌రోడ్డుపై నిర్వహించిన తనిఖీలో ఓ కంపెనీ డిటర్జెంట్ పౌడర్ సప్లయ్ డీలర్ గంగుల రాంబాబు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.84వేల నగదును సీజ్‌చేశారు.

● సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని ఖమ్మం జిల్లా సరిహద్దు శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టులో రూ.1.96 లక్షలు విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నుంచి డీసీఎం వ్యాన్‌లో కోదాడకు వస్తుండగా, చెక్‌పోస్టు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా, ఈ వస్తువులు బయట పడ్డాయన్నారు.

● తిప్పర్తి మండలం చిన్నసూరారం గ్రామానికి చెందిన జక్కలి సతీష్ తన నివాసంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా ఎఫ్‌ఎస్‌టీ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువ చేసే 14 బీర్లు, 10 ఐబీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో పరిమితికి మించి తీసుకెళ్తున్న రూ. 2.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. మండలంలోని కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద హన్మకొండ జిల్లా అన్నెపర్తి మండలం జైపూర్ గ్రామానికి చెందిన బొజ్జ సుభాష్ మిర్చి కొనుగోలు కోసం స్వగ్రామం నుంచి దంతాలపల్లి మీదుగా రూ.56,430 తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా ఆతకూర్(ఎస్) మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన నాగమల్లు రూ.1.93 లక్షలు పత్తి కొనుగోలు కోసం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశామన్నారు.

● మద్దిరాల మండల కేంద్రంలోని బెల్ట్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి సుమారు రూ.5 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏపీ వెళ్తున్న వాహనంలో అనుమతికి మించి ఉన్న రూ.9.50 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రభుత్వ మద్దతుతోనే మహిళా రైతులపై హింస కనుమరుగు

● వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస : స్వభావం, రూపాలపై వర్క్‌షాప్





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, హాజరైన మహిళలు

నల్లగొండ, నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) ప్రభుత్వం ప్రణాళికయుతమైన మద్దతు అందించినప్పుడే మహిళా రైతులు, ఒంటరి మహిళలపై వ్యవస్థీకృత హింస కనుమరుగు అవుతుందని, ఆ దిశగా జిల్లా పాలనాయంత్రాంగాలు చర్యలు తీసుకోవాలని పలువురు సామాజిక వేత్తలు, మహిళా రైతులు అభిప్రాయపడ్డారు. మహిళా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, ప్రతిపథకాన్ని మహిళల దరిచేర్చడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో మహిళలు ఏదైనా సాధించగలరని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. "వ్యవసాయ సంక్షోభ నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస: స్వభావం, రూపాలు" అనే అంశంపై నల్లగొండ జిల్లా కేంద్రంలో మహిళా కిసాన్ అధికార్ మంచ్, సొప్పికామ్, గ్రామ్య రీసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ సంస్థలు శనివారం వర్క్‌షాప్ నిర్వహించాయి. నారీశక్తి అవార్డు గ్రహీత, సామాజికవేత్త రుక్మిణీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో పలువురు మహిళారైతులు, ఒంటరి మహిళలు తమ అనుభవాలను వివరించారు.

మహిళా రైతుల ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులు, ఒంటరిమహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆర్థిక స్వాలంభనకు, పురోభివృద్ధికి జిల్లా పాలనాయంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కోరుతున్నాం. మేం జరిపిన అధ్యయనంలో నల్లగొండ జిల్లాలో మహిళారైతులు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు భూమి హక్కు లేకపోవడంతో నిర్మాణాత్మక హింసకు లోనవుతున్నారు. వారి ఎదుగుదలకు ప్రభుత్వం సహకరించాలి. ప్రధానంగా భూమి, నీటివనరులు కల్పించాలి. మార్కెటింగ్ అవకాశాలు కల్పించి వారి ఉత్పాదనలకు విలువ కల్పించాలి. చిన్నతరహాపరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధికి రుణాలందించాలి. ఒంటరి మహిళలకు పింఛన్లు, రేషన్‌కార్డులివ్వాలి. ఇతర అన్ని సహకారాలు అందించి ప్రణాళికాయుతంగా వారి వృద్ధికి తోడ్పడాలి.

- రుక్మిణీరావు, సామాజికవేత్త, నారీశక్తి పురస్కారగ్రహీత

జీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా



నాకు 14 ఏళ్ల వయసులో పెళ్లి చేశారు. నాకు 19 ఏళ్లప్పుడు నా భర్త కరెంటు షాక్‌తో చనిపోయాడు. ఆ తర్వాత ఎనిమిదేళ్లు మా అత్తమామల వద్దనే ఉన్నా. మా మరుదులతో సమానంగా నేను వ్యవసాయం చేసేదాన్ని. వాళ్లలాగే నాగలి పట్టా. మందుబస్తాలు మోశా. ఇంటిపనులు చేశా. అన్ని భరించాను. ఆస్తిలో నా వాటా నాకివ్వమని అడిగితే నన్ను, నా పిల్లలను ఇంటి నుంచి ఒంటిమీద బట్టలతో తరిమేశారు. బయటకు వచ్చి కష్టపడి నా పిల్లల్ని చదవించుకున్నా. నా కొడుకు నాకష్టం చూసి హాస్టల్‌లో ఉండి చదువుకున్నాడు. నా బిడ్డని కూడా చదివించా. రూ.12 కూలికి పోయి కుటుంబాన్ని పోషించుకున్నా. గవర్నమెంట్ ఇల్లొస్తే కట్టుకున్నా. నాబిడ్డలిద్దరికీ పెళ్లిళ్లు చేశా. అయిదెకరాల భూమి సాధించా. ఇప్పుడు నా మరుదులే నా వద్దకు వచ్చి అడిగితే వాళ్లకి సాగుకి రెండెకరాలిచ్చా. మిగిలిన మూడెకరాలు నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా. కూరగాయలు సాగు చేస్తా. కోళ్లు పెంచుతా. నాజీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా. నాలాంటి ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఆపదలో ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

- అలివేలు, గొగిళ్లాపురం, చందంపేట మండలం, నల్లగొండ జిల్లా

గృహహింసకు లోనయ్యా, మాలాంటి వారిని ఆదుకోవాలి



నాకు 19 ఏళ్లప్పుడు పెళ్లి చేశారు. మా అత్తమామలతో నేను వేధింపులకు లోనయ్యాను. మా అమ్మవాళ్లింటి వెళితే కూడా ఇక్కడకు ఎందుకొచ్చావని, ఇరుగుపొరుగు సూటిమాటలతో వేధించారు. ఇంట్లో, బయట హింసకు లోనయ్యాను. ఒకదశలో డిప్రెషన్‌కు లోనవ్వాల్సి వచ్చింది. మాలాంటి వాళ్లకు ప్రభుత్వం అండగా ఉండాలి. మాకు ఇష్టం లేని పెళ్లిళ్లు, ఇష్టంలేని వృత్తులు కాకుండా నచ్చే పనులు చేసే అవకాశం కల్పించాలి. నాకు బ్యూటీషియన్ కావాలని ఉంది. అవసరమైన సహకారం ఇవ్వాలని కోరుతున్నా.

- లక్ష్మి, దేవరకొండ

ఒంటరి మహిళగా ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నా



భర్త చనిపోయిన తర్వాత నేను ఎన్నో అవస్థలు పడ్డా. ఇల్లు ఒకపక్కన కురుస్తుంటే ఇంకో పక్కన తలదాచుకున్న. నా భర్త బోర్ల మీద బోర్లు వేసి అప్పులపాలై దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. మా అత్తమామలు నన్ను చాలా ఇబ్బందిపెట్టారు. అయినా తట్టుకొని నిలబడ్డా. నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా. సొంతంగా ఇల్లు కూడా కట్టుకున్నా. పత్తి పంటలతో చాలా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నా.

- యాదమ్మ, మల్లారెడ్డిపల్లి, చింతపల్లి మండలం

మహిళా రైతులకు అన్నివిధాలా సహకరిస్తాం



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులకు వ్యవసాయశాఖ తరుపున అన్నివిధాలా సహకారం అందిస్తాం. మహిళా రైతుల హక్కుల కోసం, ఒంటరిమహిళల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం. జిల్లాలో మహిళా గ్రూపులు ఇప్పటికే ఎంతో విజయవంతంగా ముందుకెళుతున్నాయి. మహిళా రైతులు సంఘటితంగా ముందుకొస్తే అన్నివిధాలా వారికి తోడ్పాడునందిస్తాం. ప్రధానంగా చిరు, తృణధాన్యాలు, ఇతర పంటలసాగు సమయంలో మహిళా రైతులు మార్కెటింగ్ వనరులు ఏర్పర్చుకున్నాకే ఆయా పంటలు సాగు చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. మార్కెటింగ్‌పై అవగాహన లేకుండా పంటలు పండిస్తే ఇబ్బంది పడాల్సివస్తుంది. జిల్లాలో ఉద్యానపంటల సాగులో మహిళారైతుల పాత్ర గణనీయంగా ఉంది. జిల్లా వ్యవసాయాశాఖ తరుపున మహిళారైతులకు అన్నివేళలా అందుబాటులోఉండి సహకారం అందిస్తాం.

- పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధించవచ్చు



మహిళారైతులు, ఒంటరి మహిళలు నిరాశ, నిస్పృహలకు లోనుకాకూడదు. పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చు. మహిళలకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అందజేస్తోంది. మహిళల రక్షణకూ పలు చట్టాలున్నాయి. మహిళా రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా పూర్తిసహకారం అందిస్తాం. ఏవైనా శిక్షణ, ఇతర శాఖాపరమైన మద్దతు ఎల్లవేళలా అందిస్తాం. పూలసాగు, కూరగాయల సాగు విషయంలో మహిళా రైతులను ప్రోత్సహిస్తున్నాం. మహిళారైతులు గ్రూపులుగా ఏర్పడి మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుకుంటే ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నిస్తే మావంతు సహకారం అందిస్తాం.

- సంగీతలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖాధికారి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పదో తరగతి విద్యార్థి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందారు.



భూక్యా నాగు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం లావూరిభూక్యాతండాకు చెందిన భూక్యా నాగు(22) డెకరేషన్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పనిముగించుకొని బైక్‌పై స్నేహితుడు రత్నావత్ దావీద్‌తో కలిసి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై కిష్టాపురం వద్ద గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న నాగు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, దావీద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగు బావ ధరావత్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కనగల్‌లో ఉపాధ్యాయుడు



సాజీదాలీ(ఫైల్)

కనగల్, మార్చి 19 : నల్లగొండ జిల్లా కనగల్ గ్రామశివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రామకృష్ణాగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం పానగల్ ప్రాంతానికి చెందిన సాజీదాలీ కనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు(ఫిజికల్ డైరెక్టర్) పనిచేస్తున్నాడు. గుర్రంపోడు మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారిగా విధులకు హాజరైన సాజీదాలీ మంగళవారం సాయంత్రం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో కనగల్ గ్రామశివారులో ఎదురుగా వస్తున్న గడ్డి ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సాజీదాలీ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి అప్పటికే అతను మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

స్కూల్ వ్యాన్, బైక్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంజయంత్

గరిడేపల్లి, మార్చి 19: స్కూల్ వ్యాన్, బైక్‌ను ఢీకొన్న ఘటనలో పదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన రాంజయంత్ పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరై తిరిగి బైక్‌పై పొనుగోడుకు వస్తున్నాడు. గరిడేపల్లి, పొనుగోడు గ్రామాల మధ్య సూర్యాపేట రహదారిపై ఎదురుగా వస్తున్న నేరేడుచర్లకు చెందిన స్కూల్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాంజయంత్ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

10 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

కోతులగుంపుతో శాలిగౌరారం సబ్‌స్టేషన్‌లో పేలిన సీటీ

ఇబ్బందులు పడ్డ 15 గ్రామాల ప్రజలు ● నిలిచిన విద్యుత్ సరఫరా



సబ్‌స్టేషన్‌లో ఖాళీపోయిన సీటీ

శాలిగౌరారం, మార్చి 19 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్(సీటీ) పేలి 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం 10 గంటలకు సంఘటన చోటుచేసుకోగా రాత్రి 8 గంటల ప్రాంతంలో నల్లగొండ నుంచి సీటీ తెప్పించి ఏర్పాటు చేశారు. 10 గంటల పాటు 15 గ్రామాలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారంలోని సబ్‌స్టేషన్‌లోకి మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్దఎత్తున కోతుల సమూహం చొరబడింది. ఈ క్రమంలో ఓ కోతికి తీగలు తగిలి సబ్‌స్టేషన్‌లోని సీటీ పేలి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటనతో మిగతా కోతులు పరారయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సిబ్బంది మంటలను చల్లార్చారు. ఏఈ శ్రీధర్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని నూతన సీటిని నల్లగొండ నుంచి తెప్పించి రాత్రి 8 గంటలకు ఏర్పాటుచేశారు. కాలిపోయిన సీటి విలువ రూ.20వేల వరకు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోతుల చొరబడి ప్రతీ సందర్భంలోనూ సీటీలు ఖాళీపోవడం అటు నష్టంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బంది పడటం తరుచూ జరుగుతోంది. కోతులు సబ్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఆరుగురికి గాయాలు

భువనగిరి రూరల్, మార్చి 19 : పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు గొడ్డలి, కర్రలతో దాడి చేసుకున్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన పశువులు ఎలిమినేటి పద్మారెడ్డి వరి చేనులో మేస్తుండడంతో పద్మారెడ్డి దూషణలకు దిగాడు. పక్కనే ఉన్న సత్తయ్య, అతడి కుమారుడు బాలమల్లేష్, గోపాలకృష్ణలు గొడ్డలితో దాడి చేయడంతో అక్కడనే ఉన్న పద్మారెడ్డి భార్య కళమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డి, అడ్డుపడడంతో వారిపై కూడా దాడికి దిగారు. ప్రతీగా వీరు కూడా సత్తయ్య, బాల మల్లేష్, గోపాల కృష్ణలపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘర్షణలో పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి తీవ్రంగా, బాలమల్లేష్, గోపాలకృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయనపడిన ఎలిమినేటి కళమ్మ, పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డిలను మెరుగైన వైద్యసేవల కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన బాలమల్లేష్, గోపాల కృష్ణ, సత్తయ్యలు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గుట్టపై నేత్రపర్వంగా రథోత్సవం



భక్తుల సందోహం మధ్య తిరువీధుల్లో రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 19 : ఏకశిఖర వాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణలక్ష్మీ నరసింహుడు దివ్య విమానరథంలో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. జగత్ కల్యాణం..విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో దివ్యవిమాన రథోత్సవం శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో రాత్రి వేళ మూలమూర్తులకు మహానివేదనల అనంతరం వైభవంగా కొనసాగింది. వివిధరకాల పుష్పాలు, మామిడి, అరటి ఆకుల తోరణలతో స్వామివారి దివ్యవిమాన రథాన్ని శోభాయామానంగా అలంకరించారు. ప్రధానాలయ పడమటి సప్తతల మహారాజగోపురం వద్ద అర్చకబృందం విశ్వక్సేనుడికి తొలి పూజలతో రథాంగ హోమం, రథాంగబలి, దిష్టికుంభ పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో నూతన కల్యాణ దంపతులైన లక్ష్మీ, నారసింహులను దివ్యమనోహరంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దివ్యవిమాన రథంపై అధిష్ఠింపజేశారు. రుత్వికులు, అర్చకబృందం వేదపారాయణాలు, మూలమంత్ర జప పఠనాలు, వేదమంత్రాలతో రథాంగ హోమ పూజలు జరిపి రథస్థ లక్ష్మీనారసింహుడికి హారతి నివేదించారు. వేద మంత్ర పఠనాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ లక్ష్మీనృసింహుడిని దివ్యవిమాన రథంపై విహరింపజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. రథాంగ రూఢుడైన లక్ష్మీనృసింహుడి దివ్యవిమాన రథోత్సవంలో భక్తజనులు దర్శించుకుని తరించారు. రథస్థ కేశవుడిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. స్వామివారి రథోత్సవంలో పాల్గొనేందుకు యాత్రాజనులు తండోపతండాలుగా తరలి వచ్చారు. స్వామివారి దివ్య విమాన రథోత్సవ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చకబృందం ఆధ్వర్యంలో సంప్రదాయరీతిలో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో ఏ భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు

ఉపాధి కూలీలకు వసతులు కరువు

» ఏళ్ల తరబడి టెంట్లు, మెడికల్ కిట్లు రాని వైనం » పట్టించుకోని అధికారులు


సీతారాంపురంలో చెరువుకుంటలో పని చేస్తున్న కూలీలు

గుండాల, మార్చి 19: పల్లెల్లో కూలీల వలసల ను నివారించడంతో పాటు వారికి పని కల్పించి చేసి న పనికి తగినట్లుగా వేతనాలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రారంభంలో దశల వారీగా కూలీలకు గడ్డ పారలు, మెడికల్ కిట్లు, టెంట్లు(గుడారాలు), తాగు నీరు లాంటి వసతులను కల్పించినప్పటికీ రాను రా ను వారికి ఎలాంటి సదుపాయాలను కల్పించడం లే దు.ఇది వరకు కూలీలు సొంతంగా గడ్డపార సమ కూర్చుకుంటే రోజుకు రూ. 10, తాగు నీటి కోసం రూ.5అందజేసే వారు. కనీసం ఇప్పుడు పని ప్రదేశం లో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవు తున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూ లీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. అలసటగా ఉంటే పొదలు, చెట్ల చాటున సేద తీర్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్‌ను నియమిస్తే కూలీలకు సౌకర్యంగా ఉం టుంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు వసతు లు లేకపోవడంతో ఎండలోనే సేద తీరుతున్నారు. కూలీలకు భోజనం చేయడానికి, అలసటగా ఉన్న ప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడా రాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేసేది. వాటిని క్షేత్ర సహాయకులు ప్రతీ రోజు పని ప్రదేశానికి తీసుకు వెళ్లి వసతి కల్పించేవారు. ఆరు నుంచి ఏడు సంవ త్సరాలుగా గుడారాలు, మెడికల్ కిట్లు ఇవ్వడం మరి చారు. కిట్లులో అయోడిన్ బాటిల్, బ్యాండేజి, దూది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొన్ని రకాల మాత్రలు ఉండేవి. కూలీలకు వీటి ని కూడా ఏళ్ల తరబడి సమకూ ర్చడం లేదు. పనికి ఉపయోగించే పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు, గుడారాలు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతు న్నారు.

ఎలాంటి వసతులు కల్పించడం లేదు



పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి పరికరాలను ఇవ్వడంలేదు. గతంలో టెం ట్లు,మెడికల్ కిట్లు ఇచ్చేవారు. ఇప్పుడు తాగ డానికి నీరు కూడా మేమే తెచ్చుకుంటున్నాం. అలసట గా ఉంటే పొదలు, చెట్ల నీడన సేద తీరాల్సి వస్తోంది.

- మచ్చ కొండల్‌రెడ్డి, సీతారాంపురం

తాగు నీరు సరఫరా చేయాలి



ఎండలు తీవ్రంగా కొడుతున్నాయి. పని ప్రదేశంలో ఎలాంటి వసతులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాం. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్ ను నియమిస్తే సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం పని ప్రదేశంలో వసతులు కల్పించాలి.

- కప్పరి శాంతమ్మ, సీతారాంపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాను

పని ప్రదేశంలో మెడికల్ కిట్ల కోసం ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో అందించే ప్రయత్నం చేస్తాను. మిగతా సమస్యలు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ల సమస్యలను పరిష్కరిస్తాను.

- ఇమ్మానియేల్, ఉపాధిహామీ, ఏపీవో

ఓటరుకు మౌలిక వసతులు కల్పించాలి

బొమ్మలరామారం/ భువనగిరి రూరల్, మార్చి 19: ఓటరుకు మౌలిక వస తులు కల్పిచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మంగళ వారం మండలంలోని చీకటిమామిడి 7, 8 పోలింగ్ స్టేషన్, నాగినేనిపల్లి 28, 29 పోలింగ్ స్టేషన్లలోని మౌలిక వసతులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లా డారు. మండలంలోని పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు ఉన్నారు.

● అర్హులైన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో గడ్డం బాలస్వామి అన్నారు. భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో ఓటు విలు వపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జుబేర్, ఫీల్డ్ అసిస్టెంట్ నకరికంటి సుధాకర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



చౌటుప్పల్‌లో బైక్‌ర్యాలీ తీస్తున్న దివీస్ ఉద్యోగులు

చౌటుప్పల్ టౌన్, మార్చి 19: రోడ్డు ప్రమాదాల బారిన పడకుండ ప్రతి ఒక్కరూ నిబం ధనలు పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ ఏఎస్ఐ ఇద్దయ్య కోరారు. 53వ జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం దివీస్ కంపెనీ ఉద్యోగులు హెల్మెట్‌లు ధరించి చౌటుప్పల్ నుంచి తమ కంపెనీ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో దివీస్ అధికారులు వీరయ్య, మహేష్, రంగారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సామేల్ పరామర్శ

మోత్కూరు, మార్చి 19: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మంగళ వారం ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించి, ఓదార్చారు. ఇటీవల మృతి చెందిన కూరెల్ల లక్ష్మి, బుజిలాపురంలో ఆత్మహత్య చేసుకున్న నేవూరి మహిపాల్‌రెడ్డి, దాచారంలో గుండెపోటుతో మృతి చెందిన కామిల వెంకటయ్య చిత్రపటాలకు ఎమ్మెల్యే సామేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేవూరి మహిపాల్‌రెడ్డి, కామిల వెంకటయ్య కుటుంబాలకు రూ.5000 చొప్పున ఆర్థిక సహాయం అందిం చారు. కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసి పల్ కౌన్సిలర్ మలిపెద్ది రజిత, కారుపోతుల వెంకన్న, ఎండి.సమీర్, మెంట నగేష్, బిక్షం ఆయన వెంట ఉన్నారు.

అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

భువనగిరి రూరల్, మార్చి 19: గ్రామాల్లో సంచరిస్తున్న అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషన రేట్ యాదాద్రి భువనగిరి జోన్ జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో మంగళ వారం మండలంలోని అనాజీపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. సైబర్ క్రైం దొంగతనాలు, మోసాలు, తదితర అంశాలకు సంబంధించి ప్రజ లకు పాటలు, ఆటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్, రూరల్-2 ఎస్ఐ నాగ ప్రసాద్, పోలీస్ కళా బృందం ఇన్‌చార్జి బండ్ల కృష్ణ ఉన్నారు.

అన్నదానసత్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

భువనగిరి రూరల్, మార్చి 19: మండలంలోని వడాయిగూడెం పరిధిలోని సురేంద్రపురి వద్ద నిర్మించిన వాసవి నిత్యాన్నదానసత్రం ప్రారంభోత్సవానికి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరవ్వాలని ట్రస్ట్ ప్రతిని ధులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన ప్రతిక అందజేశారు. ఏప్రిల్ 21న నిత్యాన్నదాన సత్రం ప్రారంభిస్తున్నామ న్నారు. ముందుగా ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వై.ఎల్ఎంఎస్ వాసవీ నిత్యాన్నదాన సత్రం ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయిత రాములు, ఇరుకుల్ల రామకృష్ణ, ప్రతినిధులు నూనె వెంకటేశ్వర్లు, గౌరిశెట్టి అశోక్, మంచాల ప్రభాకర్ ఉన్నారు.

వీధికుక్కల దాడిలో నలుగురికి గాయాలు

వలిగొండ, భువనగిరి రూరల్, మార్చి 19: వీధికుక్కల దాడిలో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వలిగొం డల మండల కేంద్రం పరిధిలోని ఆవాస గ్రామమైన మల్లేపల్లికి చెందిన మల్ల సత్య నారాయణ కుమారుడు మల్లికార్జున్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదు వుతున్నాడు. సోమవారం సాయంత్రం నలుగురి స్నేహితులతో కలిసి ఆరుబయట ఆడుకుంటుండగా నాలుగు వీధికుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో మల్లికార్జున్ కంటి కింది భాగంతో పాటు చెంప భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి అరుపులతో బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు కుక్కలను అక్కడినుంచి వెళ్లగొ ట్టారు. హుటాహుటిన వలిగొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో సోమవారం రాత్రి వీధికుక్క కరవటంతో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న గుజ్జ సాయికుమార్‌ను వీధి కుక్క వెంటపడి కరవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే గ్రామానికి చెందిన అక్కా తమ్ముళ్లు బాత్క భరత్, బాత్క మహా లక్ష్మీలు ఇంటి ఆవరణలో కూర్చుని ఉండగా అదే కుక్క వారిపై కూడా దాడి చేసింది. గమనించిన స్థానికులు ఆ కుక్కను వెంబడించడంతో ఊరి బయటకు పరుగులు తీసింది. గాయపడ్డ ముగ్గురికి భువనగిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తు న్నారు. వీధికుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ జెండగేకు కుటుంబ సభ్యులు ఫోన్‌లో ఫిర్యాదుచేశారు.

ప్రతీ బీజేపీ కార్యకర్త ఎంపీ అభ్యర్థే



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

భువనగిరి టౌన్, మార్చి 19: ప్రతి బీజేపీ కార్యకర్త ఎంపీ అభ్యర్థే అని పార్టీ భువ నగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగ ళవారం భువనగి రిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ఎంపీగా తాను గెలిస్తే ప్రతీ బీజేపీ కార్యకర్త విజయం సాధించినట్టేనని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమైందన్నారు. భువనగిరిని ప్రధాని మోదీకి బహుమతిగా ఇచ్చేందుకు అందరం కష్టపడదామని అన్నారు. ప్రచార సర ళిపై అవగాహన కల్పించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, పి.జగన్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ పాల్గొన్నారు.

నియామకాలు

భువనగిరి టౌన్: బీజేపీ భువనగిరి పట్టణ కమిటీని పార్టీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎంగిలి లక్ష్మణ్, ఊదరి సతీష్, ఎదుగాని సంతోష్, యాట వెంకటేష్, బెజ్జంకి రామకృష్ణారెడ్డి, గౌలికార్ కిషన్‌జీ, ప్రధాన కార్యదర్శిగా రత్నపురం శ్రీశైలం, వల్లంశెట్టి నగేష్, కార్యదర్శులుగా ఉడుత ఆంజనేయులు, కలకొండ రాము, గౌటి రాజేష్, బారాది సంతోష్, బొమ్మ మదన్మోహ న్, కోశాధికారిగా నామోజీ రాజాచారిని నియమించినట్లు ఆయన తెలిపారు. పట్టణ యువమోర్చా అధ్యక్షుడిగా దాసరి స్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా యంజాల మల్లికను నియమించినట్లు తెలిపారు.

తుర్కపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా తుర్కపల్లి మండలం రామపురం గ్రామానికి చెందిన బానోతు చత్రునాయక్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ నియామకపు పత్రాన్ని అందజేశారు.

భువనగిరి రూరల్: బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కమిటీని మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బానోతు శంకర్ నాయక్, బుడ్డ నరేష్, భూక్యా గణేష్ నాయక్, దిరావత్ లావుడ్య నాయక్, ప్రధాన కార్యదర్శిగా మాలోతు రమేష్ నాయక్, కార్యదర్శులుగా బాణోతు బాలునాయక్, రాజ్ కుమార్ నాయక్, ధీరవత్ వెంకటేష్ నాయక్, బానోతు బిచ్చా నాయక్, కోశాధికారి వాంకడోత్ సాయికుమార్ ఎన్నికయ్యారు.

రాజాపేట: మండలంలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్య గణేష్ నాయక్ బీజేపీ గిరిజన మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనను బీజేపీ నాయకులు శ్రీనివాస్‌నాయక్, అశోక్, లక్ష్మణ్, సిద్దేశ్వర్ సన్మానించారు.

భువనగిరి టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) భువనగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా స్వరూపగణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ఆదేశాల మేరకు ఆయనను నియమిం చినట్లు నియోజకవర్గ అధ్యక్షులు జోగు అంజయ్య తెలిపారు.

సంక్షిప్తంగా..

భువనగిరి రూరల్ : కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడు తుందని పీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ పుల్లిగిల్ల బాలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగే ప్రీతం బాధ్యతల స్వీకార కార్యక్రమానికి శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ విభాగం నాయకులు ఉన్నారు.

మోత్కూరు : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను మంగళవారం మోత్కూరు కాంగ్రెస్ నాయకులు కలిసి పూలమాల, శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహ, కూరెల్ల ఉప్పలయ్య, గనగాని నర్సింహ, యాకయ్య పాల్గొన్నారు.

మోటకొండూర్ : రాష్ట్ర ప్రభుత్వంరెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీ యమని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతుల తిరుమల్‌రెడ్డి అన్నారు. మంగ ళవారం మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొంతం మోహన్‌రెడ్డి, అనంతుల ఎల్లారెడ్డి, ఎదుల్ల మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రరెడ్డి, మహేందర్‌రెడ్డి, బంగారెడ్డి ఉన్నారు.

భువనగిరి టౌన్ : తైక్వాండో పోటీల్లో పట్టణంలోని దేదీప్య హైస్కూల్ విద్యా ర్థులు ప్రతిభ చూపారు. వివిధ కేటగిరీల్లో సతీష్ చరణ్‌రాజ్, సాత్విక్, ధర్మక్రిక్, భర ద్వాజ్, మధుప్రియ బెల్టులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శేషగిరిరావు, డైరెక్టర్ రంగారావు తెలిపారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీని యర్ కోచ్ ఓరుగంటి రవికుమార్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్ట్ కార్యదర్శి ఎంఏ.ఖయ్యూమ్ తెలిపారు. మండల పరి ధిలోని కొయ్యలగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు జెల్లా భావ నారుషి ఇటీవల మృతిచెందారు. భావనరుషి కుటుంబానికి రాజీవ్‌స్మారక ఫౌండేష న్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో మంగళవారం రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జెల్లా ఈశ్వరమ్మ, నాయ కులు నల్ల నర్సింహ, ఎర్రగుంట వెంకటేశం, గుర్రం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలోని వైన్స్‌లను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఈఎస్ సెగ్గం సైదులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వైన్స్ దుకాణాల్లో మద్యం స్టాక్ వివరాలు పరిశీలించారు. వైన్స్ దుకాణాల యజమానులు నిబంధ నలు పాటించాలని ఆదేశించారు. సీఐ రవిచంద్రారెడ్డి, ఎస్ఐ క్రాంతి ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : దుప్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బండెల స్వామిదాస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున అతన్ని పార్టీ నుండి సస్పెన్షన్ చేసినట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు బీసు వెంకటయ్య తెలిపారు.

● దుప్పల్లి గ్రామానికి చెందిన పులువురు బీఆర్ఎస్ కార్యకర్తలు దుప్పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బీసు వెంకటయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల అధ్య క్షుడు యాస లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాన్ని డీఈవో కె.నారాయణరెడ్డి తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ రఘురామ్‌రెడ్డి, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ మహదేవరెడ్డి ఉన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన బత్తిని మల్లేశం అనే డ్రైవర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, గీతకార్మిక సంఘం యూత్ సభ్యులు రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. మల్లేశానికి పాఠాలు బోధిం చిన ఉపాధ్యాయుడు కె.మహదేవరెడ్డి రూ.5000 అందజేశారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలో ఎండిపోతున్న వరి పంటలను ఇంచార్జీ ఎవో సుబ్బూరి సుజాత పరిశీలించారు. మండలంలోని ధర్మపురం, పల్లెర్ల గ్రామాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

● కనుముకుల ఆలయ బ్రహ్మోత్సవాల్లో సినీనటి హేమ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 19: ప్రజలు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుని, మానసిక ప్రశాంతతను పొందాలని సినీనటి హేమ అన్నారు. మండల పరిధిలోని కనుముకుల గ్రామానికి చెందిన పద్మావతీ సమేత వేంకటేశ్వ రస్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిత్య హోమం, పూర్ణాహుతి, బలిహరణం, చక్రస్నానం, మహా నివేదనం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ నిర్మా ణకర్తలు, జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చిలకమర్రి వంశీకృష్ణమాచార్యులు వేద మంత్రోచ్ఛరణలతో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సినీనటి హేమ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో ప్రశాంత వాతావరణంలో కొలువైన వేంకటేశ్వరస్వామి దేవా లయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఆలయాలు ఆధ్మాత్మిక కేంద్రాలుగా వృద్ధి చెందాలన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సాయంత్రం పుష్ప యాగం, ధ్వజావరోహణం, ద్వాదవారాధన, సప్తావరణములు విశేష నివేదన, మహదాశీర్వాదం, పండిత సన్మానం, తీర్థ ప్రసాదగోష్టి తదితర ఉత్సవాలు నిర్వహించారు. కోట అభిలాష్‌రెడ్డి - శ్రీజరెడ్డి, గొట్టం వెంకట్‌రామ్‌రెడ్డి - బాంధవిరెడ్డి, పీఏ సీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, గూడూరు అశోక్‌రెడ్డి, కోట భూపాల్‌రెడ్డి, కోట సత్తిరెడ్డి, బోగ చంద్రశేఖర్, మంగళ పల్లి రాజారమేష్, రంగ మధుగుప్తా పాల్గొన్నారు.


కనుముకులలో పూర్ణాహుతిలో పాల్గొన్న సినీ నటి హేమ


చౌటుప్పల్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని బాలాజీ రామకృష్ణ ఆల యంలో మంగళవారం పద్మావతి, అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు- సంధ్యా రాణి దంపతులు పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సుర్కంటి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం సంజయ్ బాబు, సీతారామచంద్ర స్వామి దేవస్థానం అధ్యక్షుడు బి.మురళి, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్యగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బడుగు మాణిక్యం, కౌన్సిలర్‌లు పి.శ్రీధర్‌బాబు, కె.భా స్కర్, కమిటీ ప్రతినిధులు సుర్కంటి కనకారెడ్డి, జి.సురేందర్ రెడ్డి, ముత్యాల మోహన్‌రెడ్డి, అంజయ్య, పి.మధుసూదన్, కె.రాంరెడ్డి, గోశిక రవి, పి.శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం



భువనగిరిలో స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

భువనగిరి టౌన్/ ఆలేరు రూరల్/ చౌటుప్పల్ టౌన్/ మోత్కూరు, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, సీపీఎం జాతీయ నాయకురాలు మల్లు స్వరాజ్యం జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. స్వరాజ్యం స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటాల వద్ద సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించి, ఆమె పోరాట స్ఫూర్తిని కొని యాడారు. 12 ఏళ్ల వయస్సులోనే వెట్టి చాకిరీ, బానిసత్వా నికి వ్యతిరేకంగా నాటి దొరలు, జాగీరుదారులపై ఉద్యమం చేసిన గొప్ప నాయకురాలన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నీడలో పేదల పక్షాన నిలిచారన్నారు. భువనగి రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, నాయకులు కొండమడుగు నరసింహ, కల్లూరి మల్లేశం, స్వరూప, సుజాత పాల్గొన్నారు.

● ఆలేరులో నిర్వమించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దూసరి వెంకటేష్, నాయకులు జూకంటి పౌల్, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, పోచయ్య, యాదగిరి, బాల స్వామి, సుదాకర్‌రెడ్డి ఉన్నారు.


చౌటుప్పల్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

● చౌటుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి.పాషా, మండల కార్యదర్శి గంగదేవి సైదులు, మునిసిపాలిటీ కార్య దర్శి బండారు నర్సింహ, నాయకులు బోయ యాదయ్య, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, ఎ.నందీశ్వర్, కొండె శ్రీశైలం, బత్తుల దాసు, ధశరథ, శేఖర్, సాలయ్య పాల్గొన్నారు.

● మోత్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యురాలు రాచకొండ రాములమ్మ, సీపీఎం మోత్కూరు, అడ్డగూడూరు మండలాల కార్యదర్శులు గుండు వెంకటనర్సు, బుర్రు అనిల్‌కుమార్, మండల కమిటీ సభ్యులు దడిపెల్లి ప్రభాకర్, చంద్రయ్య, లక్ష్మి, అలివేలు పాల్గొన్నారు. మోత్కూరు యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహిం చిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వెంక టాచారి, పెన్షనర్ల సంఘం జిల్లా కోశాధికారి యామగాని బుగ్గయ్య, ఎ.సత్తయ్య, డి.సోమేశ్వర్, టి.ఉప్పలయ్య, డి.శ్రీని వాస్ పాల్గొన్నారు.

పలుచోట్ల చిరుజల్లులు

మోత్కూరు/ వలిగొండ, మార్చి 19: పలు మండలాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. మోత్కూరు, ఆత్మ కూరు(ఎం), అడ్డగూడూరు, వలిగొండ, మండలాల్లో తేలిక పాటి జల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతం కావడంతో వడగండ్ల వర్షం కురిస్తే వరి పైరు దెబ్బతింటుందేమోనని రైతులు ఆందోళన చేందారు. చిరుజల్లులతో కూడిన వర్షం కురి యడంతో ఓ గండం తప్పిందని రైతులు ఊపిరి పీల్చుకు న్నారు. ఈ వర్షం ఎండుతున్న వరి చేలకు, తోటలకు కొంత మేలు చేస్తుందని, వర్షంతో ఎలాంటి నష్టం జరగలేదని రైతులు తెలిపారు. వలిగొండ పట్టణంలో విద్యుత్‌కు అంత రాయం కలిగింది. పదో తరగతి వార్షిక పరీక్షలు రాయడానికి వెళ్లే కొంతమంది విద్యార్థులు తడిశారు. మరికొందరు విద్యా ర్థులు సమీపంలో ఉన్న చెట్ల కింద, రేకుల షెడ్ల కింద నిలు చున్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



వలిగొండ: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌రాజు

వలిగొండ, మార్చి 19: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీపీ నూతి రమేష్‌రాజు అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సాధారణ మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లా డుతూ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాల న్నారు. గ్రామాల్లో జీరో కరెంట్ బిల్లులు అర్హులకు అందడం లేదని ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి సభలో ప్రస్తావించగా ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజా పాలనలో భాగంగా అర్హులందరికీ 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందుతుందని ఎంపీపీ హామీ ఇచ్చారు. పలు చోట్ల విద్యుత్ సమస్యలు ఉన్నాయని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. కొత్తవారికి రేషన్‌కార్డుల ప్రక్రియ జరగడం లేదని సభ్యుడు మల్లేశం సభ దృష్టికి తీసుకురాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరం రేషన్ కార్డుల నమోదు జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. సాధారణ మండల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా చర్చలతో సాదాసీదాగా సాగింది. సమావే శంలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బాతరాజు ఉమ, తహ సీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు సునీత, జ్యోతి, ఎల్లయ్య, మల్లేశం, యశోద, భాగ్యమ్మ, వెంకట్‌రెడ్డి, లలిత, ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎస్‌కె.రసూల్, ఎంపీవో కేధారీశ్వర్, ఏఈ మచ్చేందర్, ఏపీఎం జానీ, ఏపీవో పరుశరాములు, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో అక్రమాలపై ప్రజాప్రతినిధుల నిలదీత

బీబీనగర్ : మండలంలోని లెప్రసీ కాలనీలో అక్రమ నిర్మాణా లపై మండల సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. మంగళ వారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. బీబీనగర్ ఎంపీటీసీ గోళి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ సమీపంలోని లెప్రసీ కాలనీలో ఇంటి స్థలాల అక్రమణ, నిర్మాణాలను అధికారుల దృష్టికి తీసుకవె ళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో కుష్ఠు రోగుల సౌకర్యార్థం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, అందులో కొందరు ఇళ్ల నిర్మించుకుని నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కాలనీలో ఓ మహిళ స్థానికేతరుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఇంటి స్థలాలు అప్పగిస్తోందని, ఈ క్రమంలో నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయని సభకు వివరిం చారు. అంతే కాకుండా వందలాది గజాల స్థలాన్ని ఆక్రమించి ప్రార్థనా నిర్మాణం చేపట్టారని, ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినప్ప టికి స్పందించకపోవడంపై నిలదీశారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులోని నివాస ప్రాంతాలకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నదని కొంత మంది ఇళ్లలో వాటర్ ఫిల్టర్లను నిర్వహిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటి పోయి నీటి ఎద్దడి తలెత్తుతోందని అధికారులు తక్షణమే స్పందించి నీటి సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతిని ధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.


బీబీనగర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి